క్లుప్తంగా

డ్రంకెన్ డ్రైవ్ తనిఖీ



ఏటూరునాగారం : మండలంలోని బస్టాండ్‌లో శనివారం రాత్రి స్థానిక సీఐ అనుముల శ్రీనివాస్ డ్రంకెన్ డ్రైవ్ తనిఖీ చేపట్టారు. వాహనదారులను బ్రీత్ ఎనలైజర్ మిషన్‌తో తనిఖీలు చేసి రోడ్డు నిబంధనలు పాటించాలని కోరారు. వాహనదారులు మద్యం తాగి డ్రైవింగ్ చేయొద్దని తెలిపారు. వాహనాల్లో పరిమితికి మించి ప్రజలను తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. గూడ్స్ వాహనాల్లో కూలీలను, ప్రజలను తరలించొద్దని వెల్లడించారు.

మంత్రికి కృతజ్ఞతలు

కాళేశ్వరం: మహదేవపూర్ మండల అభివృద్ధికి రూ.1.05కోట్ల నిధులను విడుదల చేసినందుకు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు మాజీ ఎంపీపీ రాణిబాయి, మాజీ జెడ్పీటీసీ అరుణ, మాజీ సర్పంచ్ విలాస్‌రావు శనివారం వేర్వేరుగా ప్రకటనల్లో కృతజ్ఞతలు తెలిపారు. అలాగే నిధులతో పాటు మహదేవపూర్‌కు ఫైర్‌స్టేషన్, 18పోస్టులు మంజూరు చేసిన మంత్రికి మహదేవపూర్ బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కోట రాజబాపు కృతజ్ఞతలు తెలిపారు.

'దళితబంధు నిధులు విడుదల చేయాలి'

కాటారం: కాటారం సబ్ డివిజన్ పరిధి మండలాల్లోని లబ్ధిదారులకు గత ప్రభుత్వం హయాంలో మంజూరై ఫ్రీజింగ్‌లో ఉన్న దళితబంధు నిధులను విడుదల చేయాలని దళితబంధు సాధన సమితి అధ్యక్షుడు నముండ్ల సంపత్‌మహారాజ్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన దళితబంధు సాధన సమితి ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాబోయే ప్రత్యేక అసెంబ్లీ సమావేశాల్లో మంత్రి శ్రీధర్‌బాబు చొరవ చూపి నిధుల విడుదలకు కృషి చేయాలని కోరారు.

నీటి తొట్లు నిరుపయోగం



ధ్వంసమైన నీటితొట్టి



మురికి నీటిని తాగుతున్న పశువులు

తాగునీటికి అల్లాడుతున్న మూగజీవాలు

● పట్టించుకోని పంచాయతీ అధికారులు

వెంకటాపురం(కె): భానుడి భగభగలతో ఎండవేడి పెరుగుతోంది.. పశువులు, మూగజీవాలు దాహార్తి తీర్చుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. గతంలో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ నిధులతో ప్రభుత్వం గ్రామాల్లో పశువుల తాగునీటి కోసం తొట్టిలు నిర్మించింది. నీటి సౌకర్యం ఉన్న ట్యాంక్‌లు, పబ్లిక్ ట్యాప్‌ల వద్ద తొట్టిలను ఏర్పాటు చేసింది. కాగా వాటిని సక్రమంగా వినియోగించకపోవడంతో పాటు నీటి తొట్టిల నిర్వహణను పంచాయతీ అధికారులు పట్టించుకోకపోవడంతో పశువులు తాగునీటి కోసం అల్లాడుతున్నాయి.

నిర్వహణ లోపంతో శిథిలావస్థకు..

మండలంలోని పలు గ్రామాల్లో పశువుల దాహార్తి తీర్చేందుకు ఏర్పాటు చేసిన నీటి తొట్టిల నిర్వహణను స్థానిక అధికారులు పట్టించుకోకపోవడంతో శిథిలావస్థలో చేరాయి. మండల పరిధిలోని వీరాపురం, పాత్రాపురం, చిరుపల్లి, ఉప్పేడు గ్రామాల్లో ఏర్పాటు చేసిన నీటి తొట్టిలు శిథిలావస్థకు చేరి నిరుపయోగంగా మారాయి. వెంకటాపురంలో ఏర్పాటు చేసిన నీటి తొట్టిను అధికారులు పట్టించుకోకపోవడంతో ధ్వంసమైంది. ఇప్పటికైనా అధికారులు పశువుల దాహార్తి తీర్చేందుకు నీటి తొట్టిలపై దృష్టి సారించాలని, నిరుపయోగంగా ఉన్న వాటిని వినియోగంలోకి తీసుకువచ్చేలా చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

మరమ్మతు చేయాలి



మండలంలోని పలు గ్రామల్లో ఏర్పాటు చేసిన నీటి తొట్టిలను ఉపయోగంలోకి తీసుకు వచ్చి నీరు ఉండేలా అధికారులు చర్యలు చేపట్టాలి. నిరుపయోగంగా ఉన్న నీటి తొట్లను మరమ్మతులు చేయాలి. పశువులకు తాగునీరు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

\- కోటేశ్వరావు, రైతు, జీసీ మల్లిగూడెం

అధికారులు దృష్టి సారించాలి



పశువుల దాహార్తి తీర్చేందుకు ఏర్పాటు చేసిన నీటి తొట్టిలపై అధికారులు దృష్టి సారించాలి. వేసవిలో తాగునీటి కోసం పశువులు ఇబ్బందులు పడకుండా చర్యలు చేపట్టాలి. అన్ని గ్రామాల్లో పశువుల కోసం తాగునీటి నీటి తొట్టిను ఏర్పాటు చేయాలి.

\- నర్సింహాచారి, వెంకటాపురం

పంటలకు సాగు నీరందించాలి

బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రవీందర్

చిట్యాల: యాసంగిలో రైతులు పండిస్తున్న పంటలకు కాల్వల ద్వారా సాగు నీరు అందించాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు అల్లం రవీందర్, మాజీ జెడ్పీటీసీ గొర్రె సాగర్ ప్రభుత్వాన్ని కోరారు. శనివారం మండలంలోని రైతుల పంటలను వారు పరిశీలించి మాట్లాడారు. భూగర్భ జలాలు అడుగంటి పంటలకు సాగు నీరందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రేగొండ నుంచి మండలంలోని పలు గ్రామాలకు ఉన్న కాల్వల ద్వారా ఎస్సారెస్పీ నీటిని విడుదల చేసి పంటలను కాపాడాలని కోరారు. గత ప్రభుత్వ హయాంలో పంటలకు నీరందించిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పిట్ట సురేశ్, మండల ప్రధాన కార్యదర్శి ఎరుకొండ రాజేందర్‌గౌడ్, మాజీ సర్పంచ్‌లు పుట్టపాక మహేందర్, భద్రయ్య, మాజీ ఎంపీటీసీ జంబూల తిరుపతి, చంద్రమౌళి, దామెర రాజు, ఆనంద్ రెడ్డి, స్వామి దాస్ రైతులు ఉన్నారు.

ఇన్‌స్పైర్ అవార్డుకు ఎంపిక

రేగొండ: మండల కేంద్రంలోని మహాత్మ జ్యోతి బాపూలే పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థి వెంగల ఉజ్వల్ ఇన్‌స్పైర్ అవార్డుకు ఎంపికయ్యాడు. ఎంపికైన ప్రాజెక్ట్‌ను జిల్లా స్థాయిలో ప్రదర్శిస్తాడని పాఠశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు తెలిపారు. విద్యార్థి రూపొందించిన ప్రాజెక్ట్‌ను మరింత అభివృద్ధి చేసుకోవడానికి రూ.10 వేలు నగదు ప్రోత్సాహకం విద్యార్థుల ఖాతాలో జమ చేయనున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు విద్యార్థిని శనివారం ఘనంగా సన్మానించారు.

'మహిళల అభివృద్ధే.. సమాజాభివృద్ధి'



మాట్లాడుతున్న మహేందర్

ములుగు : మహిళలు అభివృద్ధి సాధించినప్పుడే సమాజాభివృద్ధి సాధ్యమవుతుందని చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మేకల మహేందర్ తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జిల్లాకేంద్రంలోని సఖి వన్‌స్టాప్ సెంటర్, చైల్డ్ లైన్ సెంటర్‌లో శనివారం న్యాయవిజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మహేందర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మహిళలు సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. పురుషులతో పాటు మహిళలకు సమాన హక్కులు ఉన్నాయని సూచించారు. అయినప్పటికీ ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది మంది మహిళలు ప్రాథమిక స్వేచ్ఛ కోసం పోరాడుతూనే ఉన్నారని వివరించారు. మహిళల కోసం అనేక చట్టాలు ఉన్నాయని, ప్రతీ ఒక్కరూ చట్టంపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఏ విషయంలోనైనా స్వయంగా ముందుకు వచ్చిన ఉచిత న్యాయ సలహా తీసుకోవచ్చని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ బానోత్ స్వామిదాస్, సఖీ సెంటర్ సీఏ లావణ్య, కౌన్సిలర్ కల్పన, లీగల్ కౌన్సిలర్ ప్రణయ్‌ప్రసాద్, మౌనిక, రాధ, రజిని, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



యోగా చేస్తున్న మహిళలు, యువకులు

ఏటూరునాగారం : మండల కేంద్రంలోని సాయి బాబా ఆలయ ఫంక్షన్‌హాల్‌లో శనివారం సాయంత్రం రామచంద్ర మిషన్, హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థల ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం సందర్భంగా యోగా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సింధూర హాజరై మాట్లాడారు. ప్రతీ ఒక్కరు ధ్యానం చేయాలన్నారు. ప్రతి రోజు యోగా చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సాయి బాబా ఆలయ చైర్మన్ ప్రభాకర్, రామచంద్ర మిషన్, హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన యాత్రకు తరలిన విద్యార్థులు



కిన్నెరసాని వన్యప్రాణి అభయారణ్యం వద్ద విద్యార్థులు

మంగపేట : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎంశ్రీ పథకంలో భాగంగా మండలంలోని రాజుపేట ఉన్నత పాఠశాల హెచ్‌ఎం బానోత్ బాలాజీ ఆధ్వర్యంలో విద్యార్థులు శనివారం విజ్ఞాన యాత్రకు తరలివెళ్లారు. పాఠశాలకు చెందిన 240 మంది విద్యార్థులు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలంలోని భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్ (బీటీపీఎస్) సందర్శించారు. బీటీపీఎస్ థర్మల్ పవర్ ఉత్పత్తి ఎలా అవుతుంది.. దాని పనితీరు, నూతన టెక్నాలజీ, పవర్ ప్రొడక్షన్, రాష్ట్ర సాంకేతిక రంగాల్లో మార్పుల వివరాలను అక్కడి అధికారులు విద్యార్థులకు వివరించారు. అనంతరం కిన్నెరసాని ప్రాజెక్టు, జింకల పార్కును సందర్శించి విద్యార్థులకు బోటింగ్ చేయించారు. భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దర్శించుకున్నారు. సమీపంలోని పర్ణశాలను సందర్శించి రాముడు నడయాడిన ప్రాంతాలను సందర్శించి ఆయా ప్రాంతాల ప్రాముఖ్యతను వివరించారు. పాఠశాల విద్యార్థులకు రాబోయే కాలంలో శాస్త్ర సాంకేతిక విజ్ఞానాన్ని పెంపొందించేందుకు దోహదపడేందుకు పీఎంశ్రీ పథకంలో భాగంగా కార్యక్రమాన్ని నిర్వహించినట్లు హెచ్‌ఎం బాలాజీ తెలిపారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శపాఠశాల చైర్మన్ ఎర్రం సుమతి, ఉపాధ్యాయులు పద్మ, శ్రీనివాస్, రామారావు, శ్రీనివాస్, మహాదేవి, పోషన్న, గణేష్, జమున, వీరనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గొత్తికోయ యువతి అస్థిపంజరం లభ్యం

ఎస్‌ఎస్‌తాడ్వాయి : మండలంలోని జలగలంచ దుర్గం గుట్ట సమీపంలో గొత్తికోయ యువతి మడకం అడిమి(26) అస్థిపంజరం లభ్యమైనట్లు ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం జలగలంచ దుర్గం గుట్ట వద్ద మహిళ మృతదేహాన్ని గుర్తించిన ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ సమాచారం మేరకు శనివారం గుట్ట వద్దకు వెళ్లి పరిశీలించామన్నారు. మృతిచెందిన యువతి అస్థిపంజరం లభ్యమైంది. మడకం అడిమి 2024, జూలై 11వ తేదీ ఇంట్లో గొడవ పడి పుట్టగొడుగుల కోసం అడవికి వెళ్లి తిరిగి రాలేదు. ఆమె కోసం చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. గతంలో కూడా గొడవ పడినప్పుడు ఛత్తీస్‌గఢ్‌కు వెళ్లి కొద్దిరోజుల తర్వాత తిరిగి ఇంటికి వచ్చేది. ఇంతకుముందు రెండు మూడు సార్లు ఇలా జరిగిందని కుటుంబ సభ్యులు చెప్పినట్లు వివరించారు. ఇప్పుడు కూడా అలానే వెళ్లిందనుకొని పోలీసులకు ఫిర్యాదు చేయలేదన్నారు. తండ్రి మడకం ఇడుమయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి

ములుగు రూరల్ : మండలంలోని జీవింతరావుపల్లి ఎస్సీ కాలనీలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు. కాలనీలో మోటార్ పనిచేయక 10 రోజులు గడుస్తోందని, మరమ్మతు చేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని శనివారం ఆందోళన వ్యక్తం చేశారు. పంచాయతీ కార్యదర్శికి సమస్యను వివరించిన పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నా రు. ఉన్నతాధికారులు స్పందించి వెంటనే మో టార్ మరమ్మతులు చేపట్టి సమస్యను పరిష్కరించాలని కోరారు.

దేవాదులలో మరో మోటారు పంపింగ్ షురూ..



దేవాదుల వద్ద కొనసాగుతున్న నీటి పంపింగ్

కన్నాయిగూడెం: మండల పరిధిలోని తుపాకులగూడెం గ్రామ పంచాయతీ పరిధిలో గల గుట్టలగంగారం గ్రామంలో గోదావరి వద్ద ఉన్న దేవాదుల పంపింగ్‌లో మరో మోటారును ఆన్ చేసి అధికారులు నీటిని పంపింగ్‌ను ప్రారంభించారు. కొన్నిరోజులుగా పంపింగ్ వద్ద ఫేజ్ 1లో ఒక మోటర్‌ను, ఫేజ్ త్రీలోని నాలుగు మోటార్లను ఆన్‌చేసి నీటిని పంపింగ్‌ను కొనసాగించిన అధికారులు శనివారం మరో మోటారును ఆన్‌చేసి ఆరు మోటార్ల ద్వారా నీటి పంపింగ్‌ను కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ఆరు మోటార్ల ద్వారా 1,661 క్యూసెక్కుల నీటిని పంపింగ్ చేస్తున్నట్లు ఇంజినీరింగ్ అధికారులు వెల్లడించారు.

పట్టణాల్లో 'ఉపాధి' అమలు చేయాలి

భూపాలపల్లి అర్బన్: పట్టణ ప్రాంతాల్లో మహిళలకు ఉపాధిహామీ పథకం అమలు చేయాలని ఐద్వా జిల్లా కార్యదర్శి ఎస్.ప్రీతి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి చెన్నూరి రమేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా శనివారం ఐద్వా, సీఐటీయూ, డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, ఎన్‌పీఆర్‌డీ, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో వారు పాల్గొన్నారు. మహిళలకు నరేంద్ర మోదీ ప్రభుత్వం గత ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీని నీరుగారుస్తుందన్నారు. ఇటీవల ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో ఉపాధిహామీ బడ్జెట్ కేటాయింపు తగ్గించారని ఆందోళన వ్యక్తం చేశారు.

మహిళలు ఆత్మవిశ్వాసంతో సాగాలి



ములుగు: ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న ఎస్టీయూ సభ్యులు



వాజేడు: కేక్ కట్ చేస్తున్న వైద్యులు, మహిళలు



గోవిందరావుపేట: చల్వాయిలో ఉపాధి హామీ కూలీలకు..

● సమగ్ర శిక్ష సెక్టోరియల్ జిల్లా అధికారి రమాదేవి

ములుగు : మహిళలు సమాజంలో ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని సమగ్ర శిక్ష సెక్టోరియల్ జిల్లా అధికారి గ్యాదరి రమాదేవి సూచించారు. ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శిరుప సతీశ్‌కుమార్, ఏళ్ల మధుసూదన్ ఆధ్వర్యంలో శనివారం జిల్లా కేంద్రంలోని ఆ శాఖ భవనంలో 30 మంది మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలకు పూర్తిస్థాయి సాధికారత లభించినప్పుడే సమాజం అభివృద్ధి పథంలో నడుస్తోందని తెలిపారు. కార్యక్రమంలో సమన్వయకర్త జయశ్రీ, జిల్లా ఆర్థిక కార్యదర్శి పోరిక శంకర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోలం కృష్ణయ్య, ఉపాధ్యక్షుడు మూడు కసన్‌సింగ్, ఆయా మండలాల బాధ్యులు హమీద్, డేగల రమేశ్, మాచర్ల రవి, వీరభద్రం, లకావత్ శ్రీనివాస్, కందిక రాజు, జన్ను శ్యాంసన్, బానోత్ విజయ్, ఆకుల సంతోష్‌కుమార్, దేవిరెడ్డి నిరంజన్‌రెడ్డి, చెన్నకేశవరావు, దేవి, లలిత, సుజాత, రాణి పాల్గొన్నారు.

మహిళలు సాధికారిత సాధించాలి

మహిళలు సాధికారిత దిశగా ముందుకు సాగాలని ఏరియా ఆస్పత్రి వైద్యులు అనూష, నిహారిక అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా అసోసియేట్ అధ్యక్షురాలు అజ్మీరా ప్రమీల అధ్యక్షతన జిల్లాకేంద్రంలోని సంక్షేమ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమానికి వైద్యులు హాజరై మాట్లాడారు. 50 మంది ఉత్తమ మహిళా ఉపాధ్యాయులను శాలువాలు, ప్రశంస పత్రాలను అందించి సన్మానించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర బాధ్యురాలు ప్రభావతి, అనసూర్య, జిల్లా బాధ్యురాలు అన్నపూర్ణ, జిల్లా అధ్యక్షుడు వేం యాకూబ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కోకిల శ్రీరంగం పాల్గొన్నారు. అలాగే జిల్లా కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో ఎస్సై వెంకటేశ్వర్‌రావు ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. మహిళా కానిస్టేబుళ్లతో కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు.

ఘనంగా మహిళ దినోత్సవం

వెంకటాపురం(కె) : మండల కేంద్రంలో మహిళా దినోత్సవ వేడుకలను ఆర్యవైశ్య, కాఫెడ్ స్వచ్ఛంద సేవా సంస్థ, విజన్ పబ్లిక్ స్కూల్ ఆధ్వర్యంలో వేర్వేరుగా నిర్వహించారు. ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు ఆర్యవైశ్య మహిళల ఆధ్వర్యంలో పండ్లు పంపిణీ చేశారు. విజన్ పబ్లిక్ స్కూల్ ఆధ్వర్యంలో మహిళలకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు. కాఫెడ్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహిళలు మడుగూరి ధనలక్ష్మి, తవ్వ పద్మ, ఎల్లంకి స్వప్న, కలకోట రమాదేవి, రాధిక, వేల్పూరి సరిత, కాఫెడ్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ లూర్దురాజు, చైల్డ్ డెవలప్‌మెంట్ సభ్యులు హరికృష్ణ, సీతాదేవి, కేజీబీవీ ఇన్‌చార్జ్ ఎస్ఓ శిరీష తదితరులు ఉన్నారు.

గోవిందరావుపేట : మండలంలోని పస్రా పోలీస్ స్టేషన్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మహిళా పోలీసులు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. టీజీఎస్పీ 5వ బెటాలియన్ చల్వాయిలో వివిధ హోదాల్లో పనిచేస్తున్న మహిళలను బెటాలియన్ కమాండెంట్ సుబ్రహ్మణ్యం శాలువాతో సత్కరించి, బహుమతులు అందజేశారు. పస్రాలోని సీపీఎం కార్యాలయంలో ఐద్వా ఉపాధ్యక్షురాలు మంచాల కవిత, కందుల రాజేశ్వరీ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. చల్వాయిలో ఉపాధిహామీ పనిచేస్తున్న కూలీలకు అడవి పూలతో ఒకనొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

మహిళలతోనే మనుగడ

వాజేడు : మహిళలతోనే మనుగడ సాధ్యమని పేరూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెచ్ఈఓ పాయం వేణుగోపాల్ కృష్ణ అన్నారు. పేరూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు.

'ఆకాశమే హద్దుగా ఎదగాలి'

ఏటూరునాగారం: మహిళలు ఆకాశమే హద్దుగా ఎదగాలని బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు తుమ్మ మల్లారెడ్డి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లోని మహిళా కానిస్టేబుళ్లను ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా, సామాజికంగా ఎదిగితేనే కుటుంబాలు, గ్రామాలు బాగుపడుతాయన్నారు. కాళ్ల రామకృష్ణ, గండెపల్లి నర్సయ్య, ఖాజాపాషా, బోజారావు, చంద్రబాబు పాల్గొన్నారు. అదేవిధంగా మండల కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన మహిళా డిగ్రీ కళాశాలలో వైద్యురాలు సింధుజా, గౌతమిలను కళాశాల అధ్యాపకులు సన్మానించారు. కార్యక్రమంలో సాయిబాబా ఆలయ చైర్మన్ పెండ్యాల ప్రభాకర్, రాధిక పాల్గొన్నారు. మండల కేంద్రానికి చెందిన బొనగరి మహాలక్ష్మికి 25 కిలోల బియ్యం, పప్పు, నూనె సరుకులు అందజేశారు. వైద్యుల వెంకటేశ్వర్లు, కందకట్ల వేణు, భిక్షపతి, మంతెన రాజేష్, బాలకృష్ణ, రాజన్న పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో..

మహిళా దినోత్సవం సందర్భంగా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ మహిళా నాయకులను సన్మానించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు చిటమట రఘు, తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీల ఆధ్వర్యంలో

ఆదివాసీ మహిళా రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఐటీడీఏ వద్ద కొమురం భీమ్ విగ్రహానికి పూలమాల వేసి మహిళా దినోత్సవాన్ని జరుపుకున్నారు. కార్యక్రమంలో ఉపేందర్, మైపతి వీణారాణి, రమణాల లక్ష్మయ్య, లక్ష్మీకాంత, ప్రసాద్ పాల్గొన్నారు.

మహిళా ఉపాధ్యాయులకు సన్మానం

వెంకటాపురం(ఎం): మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని జవహర్‌నగర్ మోడల్ స్కూల్‌లో మహిళా ఉపాధ్యాయులను తోటి ఉపాధ్యాయులు సత్కరించారు. జిల్లా ఉత్తమ మహిళా ఉపాధ్యాయులుగా పాఠశాలకు చెందిన అరుణాదేవి, అనురాధ, హారిక, సుల్తానాను ఎంపిక చేసినట్లు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ కృష్ణ తెలిపారు. అదేవిధంగా మండలంలోని నల్లగుంటలో వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో 25మంది మహిళా ఉద్యోగులను శాలువాలతో సత్కరించినట్లు జిల్లా అధ్యక్షుడు కొమురవెల్లి రమేశ్ తెలిపారు.



ములుగు: ప్రశంసపత్రాలు అందుకున్న ఉపాధ్యాయులతో డాక్టర్లు, సంఘం సభ్యులు



ములుగు: జిల్లా కేంద్ర గ్రంథాలయంలో..



వెంకటాపురం(కె) మండల కేంద్రంలో..



ఏటూరునాగారం: పోలీస్ స్టేషన్‌లో మహిళా కానిస్టేబుళ్లను సన్మానిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు



గోవిందరావుపేట: చల్వాయిలో..



ఏటూరునాగారం: వృద్ధురాలిని సన్మానించి బియ్యం అందజేస్తున్న బాధ్యులు



వెంకటాపురం(ఎం): మోడల్ స్కూల్‌లో..



గోవిందరావుపేట: పస్రా పోలీస్ స్టేషన్‌లో..



గోవిందరావుపేట: పస్రా సీపీఎం కార్యాలయంలో..



వెంకటాపురం(కె): కాఫెడ్ స్వచ్ఛంద సంస్థ ఆవరణంలో..